నగరపాలికలో మేనేజర్ ఉన్నట్లా.. లేనట్లా..?

లాగిన్ ఐడిలో పాత పేరు
కార్పొరేషన్‌లో స్తంభించిన పరిపాలన

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరపాలక సంస్థలో మేనేజరు సీటు ఖాళీగా కన్పిస్తోంది. ఇంతకు ముందు ఉన్న మేనేజరు బదిలీ కాగా ఇన్‌ఛార్జి అధికారి పాలన వ్యవహారాలు చూడటం లేదు. లాగిన్ ఐడిలో పాత అధికారి పేరే ఉంది. నగరపాలిక కార్యాలయంలో కీలకమైన అధికారి సీటు ఖాళీగా ఉండటంలో పాలన వ్యవహారాలు స్తంభించిపోయాయి.



ఖాళీగా ఉన్న మేనేజరు చాంబర్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో నెలరోజుల క్రితం సూపరింటెండెంట్‌ల స్థాయిలో జరిగిన సీట్ల బదిలీలలో పరిపాలన విభాగంలోని కీలకమైన మేనేజర్‌పోస్టులో లక్ష్మిదేవిని రెవెన్యూ విభాగానికి పరిమితం చేశారు. ఆ స్థానంలో ప్రజారోగ్య సూపరింటెండెంట్ సుజాతకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే ఆర్డర్ కాపీ తీసుకున్న సుజాత మాత్రం మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టకపోవడంతో ఆ కుర్చీ ఖాళీగా దర్శనమిస్తోంది. నగరపాలికలో బదిలీలు, ఉద్యోగోన్నతులతో పాటు కీలకమైన పరిపాలన విభాగానికి సంబంధించిన కార్యకలాపాలు మేనేజర్ లాగిన్ ద్వారా జరగాల్సుంది. అయితే ఆ దిశగా పరిపాలన సాగటం లేదు. ఆన్‌లైన్ లాగిన్‌లో మాత్రం మేనేజర్ కం రెవెన్యూ ఆఫీసర్‌గా ఇదివరకు మేనేజరుగా పనిచేసిన లక్ష్మీదేవి పేరు కనిపిస్తోంది. లాగిన్ ఐడి మార్చుకునే దిశగా అటు నూతనంగా మేనేజర్‌గా నియమితురాలైన సుజాత గాని ఇటు ఆ బాధ్యతల నుంచి రిలీవ్ అయిన లక్ష్మీదేవి కాని సైతం చేపట్టలేదు. అలాగే మేనేజర్‌గా రిలీవై రెవెన్యూ ఆఫీసర్ సీటుకే పరిమితమైన లక్ష్మీదేవి సైతం లాగిన్ ఐడి మార్చుకునే దిశగా అడుగులు వేయడం లేదు. దీనితో గడచిన నెల రోజులుగా కీలకమైన పరిపాలన విభాగంలో మేనేజర్ ఉన్నట్టా లేనట్టా అన్న పరిస్థితి నెలకొంది విద్యా విభాగంలో జరగాల్సిన కార్యకలాపాలను సూపరింటెండెంట్ సాలమ్మ నేరుగా ఫైళ్లను డిప్యూటీ కమిషనర్‌కు పంపుతున్నారు. ఈ నేపథ్యంలో మేనేజరు లేకపోవటంతో పరిపాలనాపరంగా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతాయని ఉద్యోగ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సీట్ల బదిలీలు జరిగిన తర్వాత బాధ్యతలను చేపట్టిన ఉద్యోగులు తమ సొంత లాగిన్ ఐడిలను రూపొందించుకోవాల్సి ఉంది ఆ దిశగా చర్యలు వారు చేపట్టలేదు. సీట్ల బదిలీలు జరిగిన తర్వాత ఆయా సీట్ల బాధ్యతలను బదిలీలైన వారు చేపట్టారా లేదా అన్న అంశాలను పరిశీలించే నాథుడే కరువయ్యారు. ఈ నేపథ్యంలో అనేక విభాగాలలో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. బదిలీలకు ముందు లాగిన్ ఐడీలు ఎవరి పేర్లతో ఉన్నాయో వాటికే గడచిన నెల రోజులుగా ఫైళ్ల ప్రాసెసింగ్ జరుగుతోంది. కనీసం వారైనా తమ లాగిన్ ఐడీలను మార్చుకునే దిశగా చర్యలు చేపట్టడం లేదు. అలాగే కొత్త సీట్లకు బదిలీ అయిన వారు సైతం తమ బాధ్యతలు చేపట్టిన స్థానాలలో నూతన లాగిన్ ఐడిలు రూపొందించుకునే దిశగా చర్యలు చేపట్టడం లేదు.ఈ నేపథ్యంలో కమిషనర్ బాలస్వామి ఈ విషయాలపై దృష్టి సారించి పాలనను గాడిలో పెట్టే ప్రయత్నం చేయాలని ఉద్యోగ వర్గాలు కోరుకుంటున్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రిలో కరెంటు కష్టాలు

జనరేటర్ లేక డయాలసిస్ రోగుల ఇబ్బందులు
ఆసుపత్రిలో అధ్వాన్నంగా వైద్య సేవలు
ఎమ్మెల్యే హామీ బుట్టదాఖలు

డయాలసిస్ కోసం ఆసుపత్రి వద్ద పడిగాపులు కాస్తున్న రోగులు

ప్రజాశక్తి - గుంతకల్లు

పట్టణంలో ఎడాపెడా విధిస్తున్న విద్యుత్ కోతలతో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం కరెంటు కోతలతో జనరేటర్ లేక వైద్యం కోసం వచ్చిన రోగులు ముఖ్యంగా డయాలసిస్ కోసం వచ్చిన కిడ్నీ బాధితులకు ప్రాణసంకటంగా మారుతోంది. పేరుకు వంద పడకల పెద్ద ఆసుపత్రి చికిత్సలో మాత్రం నానాటికీ దిగజారుతోందని ప్రజలు వాపోతున్నారు. సోమవారం ఆసుపత్రిలో ఉదయం 11 గంటల సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవటంతో డయాలసిస్ కోసం వచ్చిన కిడ్నీ బాధితులు పడిగాపులు కాసారు. ఉదయం ఎనిమిది గంటలకు వచ్చామని 12 గంటలు ఐనా కరెంటు రాకపోవటంతో ఇబ్బందులు పడుతున్నామని కిడ్నీ బాధితులు గుత్తి ఆర్ ఎస్ కు చెందిన యాంద్రి, తిమ్మాపురం గ్రామానికి చెందిన మౌలాలి, గుంతకల్లు పట్టణానికి చెందిన అయూబ్, మొలకలపెంట గ్రామానికి చెందిన బాలకృష్ణ వాపోయారు. వారానికి మూడుసార్లు డయాలసిస్ కోసం వస్తున్నామని వచ్చిన ప్రతి సారి కరెంటు కోతలతో డయాలసిస్ చికిత్సకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డయాలసిస్ కోసం వచ్చే కిడ్నీ బాధితులకు ఆసుపత్రిలో 8 మిషన్లు ఉన్నాయి. ఐతే డయాలసిస్ కోసం గుంతకల్లు నియోజకవర్గం తోపాటు కర్నూలు జిల్లా నుంచి కిడ్నీ బాధితులు ఇక్కడికి వస్తున్నారు. డయాలసిస్ కోసం ఇప్పటికే 51 మంది కిడ్నీ రోగులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. రోగుల క్రియాటిన్ దృష్టిలో ఉంచుకుని అలాంటి రోగులకు వారానికి రెండు,మూడు సార్లు డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. మూత్ర పిండాలు సరిగా పని చేయని రోగులకు డయాలసిస్ చేయించుకోవడం ఎంతో ముఖ్యం.అలా ప్రతిరోజు 18 మంది కిడ్నీ రోగులు డయాలసిస్ కోసం ఆసుపత్రికి వస్తుంటారు. డయాలసిస్ చేయించుకోవడంలో జ్యాప్యం జరిగితే ఆ రోగుల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది.ఒక్కో రోగికి డయాలసిస్ చేసేందుకు మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుంది. అలాంటి పరిస్థితుల్లో డయాలసిస్ చేయించు కుంటున్న సమయంలో ఆసుపత్రిలో కరెంటు కోత ఏర్పడితే జనరేటర్ లేక డయాల్సిస్ మిషన్లు పనిచేయక రోగి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.కొన్ని నెలల కిందట ఆసుపత్రిలో జనరేటర్ ఏర్పాటు చేసినా ఆసుపత్రిలో కరెంటు వైరింగ్ పనులు అస్తవ్యస్తంగా ఉండడం జనరేటర్ కు వైరింగ్ అనుసంధానం కాకపోవడం తదితర కారణాలతో అది ఉపయోగంలో లేకుండా పోయిందని ఆసుపత్రి వర్గాలు అంటున్నాయి. సోమవారం డయాలసిస్ కోసం వచ్చిన కిడ్నీ బాధితులు ప్రాణ భయంతో బిక్కుబిక్కుమంటూ కనిపించారు.

ఎమ్మెల్యే హామీ బుట్టదాఖలు

స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నాలుగు నెలల క్రితం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి ఆసుపత్రి ఆవరణలో సభ నిర్వహించారు. ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సిబ్బందికి సూచించారు. అదేవిధంగా ఆసుపత్రిలో జనరేటర్‌ను ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్ కు ఆదేశాలు కూడా జారీ చేశారు.అయితే ఇప్పటివరకు జనరేటర్ ఉపయోగంలోకి తేవటంలో ఆసుపత్రి ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే చొరవ తీసుకుని ఆసుపత్రిలో జనరేటర్ సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆసుపత్రిలో జనరేటర్ ఏర్పాటు చేయాలి:సిపిఎం

ప్రభుత్వ ఆసుపత్రిలో కరెంటు కోతలతో డయాలసిస్ చికిత్సకు వచ్చిన కిడ్నీ బాధితులు,వివిధ రకాల ఆరోగ్య ఇబ్బందులతో చికిత్సలు కోసం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే జనరేటర్ ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు,పట్టణ కార్యదర్శి మారుతీ ప్రసాద్,కమిటి సభ్యులు రాము నాయక్ లు డిమాండ్ చేశారు. సోమవారం డయాలసిస్ చికిత్సకు వచ్చిన కిడ్నీ బాధితులను వారు పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్సలు అధ్వాన్నంగా ఉన్నాయని ఇప్పటికైనా ఎమ్మెల్యే చొరవ తీసుకుని ఆసుపత్రిలో జనరేటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఆసుపత్రిలో నెలకొన్న ఈ సమస్యపై డయాలసిస్ యూనిట్ మేనేజర్ మహేంద్రను వివరణ కోరగా కిడ్నీ బాధితులకు డయాలసిస్ చేసే సమయంలో కరెంటు పోయినా 45 నిమిషాలు యంత్రం బ్యాటరీ బ్యాకప్ ఉంటుందని అంతలోపుగా కరెంటు వస్తుంటుందని చెప్పారు. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్ రిపేరీ కారణంగా కరెంటు సరఫరా కాలేదని అన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

'తల్లి వందనం' అమలుపై వైసిపి దుష్ప్రచారం దుర్మార్గం

టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు, ఎంపీ అంబికా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం అమలుపై వైసిపి దుష్ప్రచారం సిగ్గుచేటని టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ అన్నారు. సోమవారం టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటి ఏడాదిలోనే అమలు చేస్తూ సుపరిపాలన అందిస్తోందన్నారు. కుటుంబంలోని చదువుకునే పిల్లలందరికి తల్లికి వందనం అమలు చేసి ప్రజల సాకరాన్ని నెరవేర్చిందన్నారు. అయితే రూ.15 వేలలో రూ.2 వేలు లోకేష్ ఖాతాలకు వెళ్లిందా అంటూ వైసిపి అండ్ కో అసత్య నిందారోపణలు చేయడం సిగ్గుచేటుగా ఉందన్నారు. వైసిపి హయాంలో అమ్మ ఒడి అందరికి ఇస్తామని హామిలిచ్చి కుటుంబంలో ఒకరికే అమలు చేసిన జగన్ చరిత్ర హీనులుగా మిగిలిపోయారని విమర్శించారు. పాఠశాలల అభివృద్ధి పేరుతో వైసిపి హయాంలో కోత విధించిన రూ.2 వేల చొప్పున కోట్లాది రూపాయలు జగన్, భారతిరెడ్డి ఖాతాలకు మళ్లించారా అంటూ మండిపడ్డారు. 40 లక్షల మందికి మీరు అమ్మఒడి ఇస్తే కూటమి ప్రభుత్వం 67 లక్షల 27 వేల మంది పిల్లలకు రూ.10 వేల కోట్లు వారి తల్లుల ఖాతాల్లోకి జమ చేసిందన్నారు. ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసిన జగన్ పార్టీకి బుద్ధిరానట్లు ఉందన్నారు. ప్రతిపక్ష హోదా లేకపోయిన కనీసం ప్రతిపక్ష పాత్ర పోషించి ప్రజల పక్షాన మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు ఆలం నరసానాయుడు, ఎడిసిసి బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నత్తను తలపిస్తున్న 'సూపర్ సిక్స్'

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

నత్తను తలపించేలా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై జూన్ 12వ తేదీతో ఏడాది పూర్తి చేసుకున్న నేపథ్యంలో సోమవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో రూపొందించిన 'దారి తప్పుతున్న టిడిపి కూటమి ఏడాది పాలన' పేరుతో బుక్‌లెట్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు నత్తనడకన సాగుతోందన్నారు. ముఖ్యంగా కార్పొరేట్ కంపెనీలకు వేలాది ఎకరాల భూములు ఇస్తూ పేదలకు ఇంటి స్థలం ఇవ్వడానికి 30 జీవో అమలు చేయడం లేదని మండిపడ్డారు. మతోన్మాదాన్ని పెంచే విధంగా కూటమి పాలన నడుస్తోందన్నారు. సూపర్ సిక్స్‌లో నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు ఊసే లేదన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ప్రస్తావనే లేదన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం మెగా డిఎస్సీ 16,400 పోస్టులు మాత్రం ప్రకటించి పరీక్షలు పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రైతులకు పెట్టుబడి సాయం, అన్నదాత సుఖీభవ రూ.20 వేలు ఏవని ప్రశ్నించారు. రైతులకు గిట్టుబాటు ధర కోసం ప్రత్యేక నిధి అమలైన పరిస్థితి లేదన్నారు. 19 నుంచి 50 సంవత్సరాలు ఉన్న ప్రతి మహిళకు 18 వేలు ఇస్తామని ఇచ్చిన హామీ అమలు చేయలేదన్నారు. మొదటి ఏడాది వీరికి రూ.32,400 కోట్ల ఎగ్గొట్టారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదన్నారు. తల్లికి వందనం పేరుతో రూ.10 వేల కోట్లు ఇచ్చామంటూ గొప్పలు చెబుతున్నారని, ఇదే ఏడాది చూస్తే విద్యుత్ ఛార్జీల భారం రూ.15,500 కోట్లు ప్రజల నెత్తిన భారాన్ని మోపారని విమర్శించారు. జిల్లాలో హెచ్‌ఎల్సీ ఆధునీకరణ పనులు చేపట్టలేదని, హంద్రీనీవా నుంచి పిల్ల కాలువలు తవ్వకుండా లైనింగ్ పనులు చేస్తున్నారన్నారు. అలాగే టిడ్కో, జగనన్న ఇళ్ల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేశారని తిరిగి వాళ్లకి ఇళ్లను ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు కౌలు రైతులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేసి రోజు వేతనం రూ.600 ఇవ్వాలని, 200 రోజుల పని కల్పించాలని, బిల్లులు చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ప్రజలందరూ కలిసి సిపిఎం, ప్రజాసంఘాలు చేసే ఉద్యమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, కార్యదర్శివర్గ సురేంద్ర, రంగమ్మ, సీనియర్ నాయకులు డి.శ్రీనివాసులు, పట్టణ కమిటీ సభ్యులు రామునాయక్, సూరి, తిమ్మప్ప, ఉలిగప్ప, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

కిటకిటలాడుతున్న రైతు సేవాకేంద్రాలు

వేలిముద్రల కోసం తరలివస్తున్న రైతులు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని అన్ని రైతు సేవా కేంద్రాలు రైతులతో కిటకిటలాడుతున్నాయి. ఈనెల 21న రైతులకు అన్నదాత సుఖీభవ డబ్బులు ఖతాల్లో జమ కావాలంటే తప్పనిసరిగా రైతులందరూ వేలిముద్రలు వేయాలని అధికారులు చెప్పడంతో ఈ పరిస్థితి వచ్చింది. రెండవ శనివారం, ఆదివారం సెలవులు రావడం.. అన్నదాత సుఖీభవ సమయం ముంచుకురావడంతో రైతులు ఒక్కసారిగా వేలిముద్రలు వేసేందుకు భారీగా తరలివస్తున్నారు. దీంతో రైతుసేవా కేంద్రాలు రైతులతో కిటకిటలాడుతున్నాయి.

వేలిముద్రలు వేస్తున్న రైతులు

మహిళా టీచర్ కిడ్నాప్ కేసు ఛేదింపు

కూతురిని కన్నతండ్రే కిడ్నాప్ చేసిన వైనం

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రవిబాబు

ప్రజాశక్తి - కళ్యాణదుర్గం రూరల్

కన్నకూతురుని కిడ్నాప్ చేసి ఆస్తిని దక్కించుకోవాలన్న ఓ తండ్రి వ్యూహం బెడిసి కొట్టింది. బాధితురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు కిడ్నాప్ కేసును చేధించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ రవిబాబు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

బెళుగుప్ప మండలం తగ్గుపర్తి గ్రామానికి చెందిన ఆనంద్, శ్యామలమ్మ అనే దంపతులకు ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు. పెద్దకూతురు మారుతమ్మ. ఈమె 2016 నుండి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. రెండవ కూతురు మహాలక్ష్మిని అదేగ్రామంలో ఎల్లప్ప అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. కుమారుడికి పెళ్లికాలేదు. మూడో కూతురు ప్రస్తుతం చదువుతోంది. పెద్ద కూతురు మారుతమ్మ సంపాదనతోనే ఆమె తల్లిదండ్రులు, కుటుంసభ్యులు జీవనం చేస్తున్నారు. ఈ కాలంలో మారుతమ్మ 15 తులాల బంగారం కొనుగోలు చేసింది. అనంతపురంలో ఇంటి స్థలం తీసుకుంది. అయితే కూతురు సంపాదనతోనే జీవిస్తున్న ఆమె తల్లిదండ్రులు తమ కూతురుకు పెళ్లి చేయడానికి ఆసక్తి కనపర్చలేదు. కూతురుకు పెళ్లి చేస్తే ఆమె వెళ్లిపోతే తమ కుటుంబం ఎలా గడవాలని భావించారు. అయితే మారుతమ్మ తనకు పెళ్లి చేయాలని 9 సంవత్సరాల నుండి తన తలిదండ్రులను అడుగుతూ వస్తోంది. అయినా వారు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో మారుతమ్మ తన చిన్ననాటి స్నేహితుడైన అదే గ్రామానికి చెందిన ఎర్రిస్వామి అనే వ్యక్తిని ప్రేమించింది. అయితే అప్పటికే ఎర్రిస్వామికి వివాహమైంది. అయినా మారుతమ్మ 20రోజుల క్రితం ఎర్రిస్వామిని పెళ్లిచేసుకుంది, దీంతో మారుతమ్మ తండ్రి ఆనంద్ తమ కూతురుపై కక్ష పెంచుకున్నాడు. తన కూతురును కిడ్నాప్ చేయాలని పథకం వేశాడు. అందుకు 9 మందిని ఏర్పాటు చేసుకున్నాడు. కళ్యాణదుర్గం ప్రాంతంలోని కూరాకుల పల్లిలోని పాఠశాలలో పనిచేస్తున్న మారుతమ్మ ఈనెల 12వ తేదీన విధులు ముగించుకుని తన భర్త ఎరిస్వామితో కలసి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వస్తుండగా అనంద్ తాను ఏర్పాటుచేసుకున్న 9 మందితో కలసి రహదారిలో కాపుకాసి మారుతమ్మను కిడ్నాప్ చేసి బోలెరో వాహనంలో బెంగుళూరుకు తీసుకెళ్లాడు. దీంతో తన భార్యను కిడ్నాప్ చేశారని ఎర్రిస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎర్రిస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఆనంద్ తన కూతురును కిడ్నాప్ చేసి బెంగుళూరులోని తన బంధువుల వద్ద ఉంచాడు. ఈ సందర్భంగా తన కూతురు మారుతమ్మను ఆనంద్ బెదిరించాడు. తన రెండో కూతురైన మహాలక్ష్మి భర్తను వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేశాడు. ఈ సందర్భంగా ఆమెను చిత్రహింసలకు గురిచేశాడు. అయితే మారుతమ్మ తెలివిగా తన తండ్రి అభ్యర్థనను అంగీకరించినట్లు నమ్మబలికింది. దీంతో ఆనంద్ తన కూతురుతో సహా వాహనంలోఈనెల 15న స్వగ్రామానికి బయలుదేరాడు. ఆసమయంలో మారుతమ్మ తాము వస్తున్న సమాచారాన్ని పోలీసులకు తెలిపింది. దీంతో కంబదూరు ఎస్ఐ, సిబ్బంది వాహనాల తనిఖీలో భాగంగా వారు వస్తున్న బోలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌ను, అతని వెంట ఉన్నవారిని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని, నేరానికి ఉపయోగించిన కత్తి స్వాధీనం చేసుకుని స్టేషన్ కు తరలించారు. బాధితురాలు మారుతమ్మను ఆసుపత్రికి తరలించారు. ఈ కేసు సమర్థవంతంగా దర్యాప్తు చేసి తక్కువ సమయంలోనే చేదించిన రూరల్ సిఐ నీలకంఠేశ్వర, రాయదుర్గం సిఐ వెంకటరమణ, కంబదూరు, కణేకన్ ఎస్ఐలు ప్రవీణ్, నాగ మధు, సిబ్బంది ఖాజా, మంజునాథ, నాగార్జున, ఆంజనేయులును జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు.

డిఐపిఆర్‌ఒగా బాలకొండయ్య

కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న డిఐపిఆర్‌ఒగా బాలకొండయ్య

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి (డిఐపిఆర్‌ఓ)గా బాలకొండయ్య బాధ్యతలు స్వీకరించారు. సోమవారం నగరంలోని రైతు బజార్ వద్దనున్న డిఐపిఆర్‌ఓ కార్యాలయంలో నూతన డిఐపిఆర్‌ఓగా బాలకొండయ్య బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్‌ని నూతన డిఐపిఆర్‌ఓ బాల కొండయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతన డిఐపిఆర్‌ఓకి అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ ని కలిసిన వారిలో జిల్లా పౌర సంబంధాల అధికారి పి.వెంకట్రమణ, ఏపిఆర్‌ఓ ప్రక్రుద్దీన్ ఉన్నారు. అనంతరం డిఐపిఆర్‌ఓ బాలకొండయ్య మాట్లాడుతూ తిరుపతి జిల్లా డిఐపిఆర్‌ఓగా పని చేస్తూ ప్రస్తుతం సాధారణ బదిలీపై అనంతపురం జిల్లాకు రావడం జరిగిందన్నారు. ఈ జిల్లాలో డిఐపిఆర్‌ఓగా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ సలహాలు, సూచనలు పాటిస్తూ శాఖా పరంగా, జర్నలిస్టుల సంక్షేమానికి, ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, అధికార కార్యక్రమాలను మీడియా ద్వారా మరింత విస్తృతం చేస్తామన్నారు. అంతకుముందు చిత్తూరు నందు సహాయ ప్రాజెక్టు అధికారి (ప్రచారం) విధులు నిర్వహించిన పి.వెంకట్రమణ జిల్లా పౌర సంబంధాల అధికారిగాను, శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లాలో ఏపిఆర్‌ఓగా విధులు నిర్వహించిన ప్రక్రుద్దీన్ అనంతపురం జిల్లాకు బదిలీ చేయడంతో వీరు అనంతపురం జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. వారికి కార్యాలయం సిబ్బంది అభినందనలు తెలిపారు.

'తల్లికి వందనం'పై విషం చిమ్ముతున్న వైసిపి

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

తల్లికి వందనం పథకం అమలుతో ప్రతి ఇంట్లో తల్లులు సంతోషంగా ఉంటే వైసిపి నాయకులు మాత్రం విషం కక్కుతున్నారని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విమర్శించారు. సోమవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో తల్లికి వందనం పథకం అమలు చేసి ప్రతి తల్లి ఖాతాలో రూ.13వేలు జమ చేయడంలో కుటుంబాలు ఆనందంగా ఉన్నాయన్నారు. గత వైసీపీ హయాంలో 42 లక్షల మందికి ఇస్తే తమ ప్రభుత్వం 67.27 లక్షల మందికి ఇచ్చిందన్నారు. ఇది తట్టుకోలేని వైసిపి నేతలు ఏడుస్తూ చౌకబారు మాటలు మాట్లాడటం తగదన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు విషం కక్కడం మానుకుని అభివృద్ధి, సంక్షేమం కోసం సహకరించాలని కోరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి
www.prajasakti.com

కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

కమిషనర్‌కు సిఐటియు నాయకుల వినతి

అనంతపురంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేసే పారిశుధ్య కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో కమిషనర్ బాలస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, తిరుమలేశులు మాట్లాడుతూ రోజూ తెల్లవారుజాము నుంచే వీధుల్లోకి వచ్చి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికులు 409 మందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పథకాలను కూడా వర్తింపజేయకుంటే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. కావున ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు పథకాలను వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మున్సిపల్ యూనియన్ సిఐటియు ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శులు బండారి స్వామి, శశీంద్రకుమార్, ఉపాధ్యక్షులు, నారాయణ, రాఘవ పెన్నా, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ కార్మికులకు వర్తింపజేయాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ ఇంజనీరింగ్ విభాగం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, సంజీవరాయుడు మల్లికార్జున, నగర గౌరవాధ్యక్షులు గోపాల్, అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళి, కోశాధికారి పోతులయ్య, కార్మికులు శివన్న, రామాంజనేయులు, గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో ధర్నా

గుత్తి : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యనారాయణ, ఎన్. రామాంజనేయులు, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ కార్మిక యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజా, రవిశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో దాదాపు 48 వేల మంది ఇంజనీరింగ్, పారిశుధ్య, ఎన్ఎంఆర్ కార్మికులు పని చేస్తున్నారన్నారు. వీరంత చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఎందుకు వర్తింపజేయలేదని ప్రశ్నించారు. ప్రజా ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షిస్తూ మున్సిపాలిటీలోని 1.50 కోట్ల ప్రజల అవసరాలను తీరుస్తూ విశిష్ట సేవలు అందిస్తున్నామని చెప్పారు. కరోనా, వరదలు తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో ప్రాణాలను పణంగా పెట్టి పనులు చేశామని గుర్తు చేశారు. తమ పిల్లలు చదువుకునేందుకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి టి.సుంకన్న, కోశాధికారి కె.బాలరంగన్న, నాయకులు ఈశ్వరయ్య, బేడల నాగేంద్ర, ఇంజనీరింగ్ విభాగ కార్మికుల యూనియన్ ఉపాధ్యక్షుడు ఎస్ఎ.మురళి, కోశాధికారి నక్కా శేఖర్, నాయకులు సాదిక్, బాబా, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో ధర్నా చేస్తున్న కార్మికులు

శింగనమల తహాశీల్దార్‌గా శేషారెడ్డి

శింగనమల : మండల తహాశీల్దార్‌గా శేషారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సాకే బ్రహ్మయ్య కణేకల్ మండలానికి బదిలీ కావడంతో పుట్లూరులో విధులు నిర్వహించిన శేషారెడ్డి ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, సీనియర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి, తదితరులు బొకేలు అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు శ్రీధర్‌రావు, తాతయ్య, రాముడు, నాగేంద్ర, వీఆర్ఏలు ఓబులేసు, ధన, ఆంజనేయులు, శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుత్తి ఆర్ఐగా కె.హనుమప్రసాద్

గుత్తి : మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా కురుబ హనుమ ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్ఐ సందీప్ బదిలీపై వెళ్లారు. కలెక్టరేట్‌లో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న హనుమాన్ ప్రసాద్ బదిలీపై ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ముందుగా తహాశీల్దార్ డి.ఓబులేసును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన ఆర్ఐ కె.హనుమాన్ ప్రసాద్‌కు వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది స్వాగతం పలికారు.

పెద్దవడుగూరు ఎఒగా మునికృష్ణ

పెద్దవడుగూరు : మండల వ్యవసాయ శాఖ అధికారిగా మునికృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్లారు. ఇక్కడ పని చేస్తున్న ఎఒ మల్లీశ్వరి అనంతపురం బదిలీ కాగా గోరంట్లలో పని చేస్తున్న మునికృష్ణ ఇక్కడికి వచ్చి బాధ్యతలు చేపట్టారు.

వైసిపి ఉపాధ్యక్షులుగా వై.గోపాల్‌యాదవ్

గుత్తి : వైసిపి మండల బూత్ కమిటీ ఉపాధ్యక్షుడిగా జక్కలచెరువు గ్రామానికి చెందిన వై.గోపాల్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు వైసీపీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. పదవి రావడానికి కారణమైన మాజీ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా కృష్ణమూర్తి

ఉరవకొండ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కృష్ణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న మమత కుందుర్పి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న కృష్ణమూర్తి ఇక్కడికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌కు ఉపాధ్యాయ బృందం శుభాకాంక్షలు తెలిపింది.

ప్రతి ఒక్కరూ యోగాను అలవర్చుకోవాలి

జిల్లా జైలు సూపరింటెండెంట్ షఫియుర్ రహిమాన్

జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న షఫియుర్ రహిమాన్

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని రోజూ యోగా చేసుకోవడం అలవర్చుకోవాలని జిల్లా జైల్ సూపరింటెండెంట్ షఫియుర్ రహిమాన్ పిలుపునిచ్చారు. సోమవారం బుక్కరాయసముద్రం మండలంలోని రెడ్డిపల్లి వద్ద ఉన్న జిల్లా జైలు ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. కావున ఇప్పటి నుంచి ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకుని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఇబి దేవి, జైలు అధికారులు వసంతకుమార్, నాగరాజ్, హరీష్, చంద్రమోహన్, రవికుమార్, ఆయుష్ అధికారులు రామ్‌కుమార్, లాల్యానాయక్, డెమో త్యాగరాజ్, డిప్యూటీ హెచ్ఇఒ గంగాధర్, వివేకానంద యోగాకేంద్రం రాజశేఖర్‌రెడ్డి, ఈస్నా ఫౌండేషన్ ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-యాడికి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలకు అధికారులు చిత్తశుద్ధితో పరిష్కారం చూపాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని టిటిడి కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డితో కలిసి అర్జీలను స్వీకరించారు. ఇందులో భాగంగా 461 మంది సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బదిలీ అయిన జిల్లా అధికారులు, ఇతర అధికారులు వారి స్థానాలకు వెళ్లి జాయిన్ కావాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి చూపించాలన్నారు. పెన్షన్లకు సంబంధించి సచివాలయ సిబ్బంది ఆలోచించి, విశ్లేషించి సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులు ఈ విషయమై అవగాహనతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, డిఆర్ఒ ఎ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జున, రామ్మోహన్, గుంతకల్లు ఆర్‌డిఒ ఎబివిఎన్ శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, జెడ్పీ సిఇఒ రామసుబ్బయ్య, డిపిఒ నాగరాజునాయుడు, డ్వామా పీడీ సలీంబాషా, డిసిహెచ్ఎస్ పాల్ రవికుమార్, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా సైనిక్ సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప, హౌసింగ్ పీడీ శైలజ, డిఎల్‌డిఒ విజయలక్ష్మి, సర్వే ఎడి రూప్లానాయక్, డిటిడబ్ల్యుఒ రామాంజనేయులు, డివిఇఒ వెంకటరమణనాయక్, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూకొఠారి, డిఆర్‌డిఎ పీడీ శైలజ, డిసిఒ అరుణకుమారి, ఎపిఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్ యాదవ్, పశుసంవర్ధక శాఖ జెడి వెంకటస్వామి, తహాశీల్దార్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని వినతి

పౌర హక్కులు పరిరక్షణ, ఉచిత విద్య, ఆర్‌టిఎ యాక్ట్‌ను పక్కాగా అమలు చేయాలని ఎపి బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ సిఐటియు తాడిపత్రి డివిజన్, సిపిఎం యాడికి శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి ఎస్.ఉమాగౌడ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ ప్రకారం 6-14ఏళ్ల వయస్సు కలిగిన ప్రతి పౌరునికీ ఉచిత, తప్పనిసరి విద్య హక్కు ఉందన్నారు. అయితే తాడిపత్రిలోని కొన్ని ప్రయివేట్ పాఠశాలలు ఈ చట్టాన్ని పాటించకుండా, కార్మికుల పిల్లల తల్లిదండ్రుల నుండి అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత తల్లిదండ్రులు ఇమ్రాన్, జయమ్మ, నయుమున్, సరస్వతి, సిపిఎం యాడికి మండల కార్యదర్శి బషీర్ అహ్మద్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మాయకుంట్ల మోహన్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లపై అవగాహన కోసం హెల్ప్‌డెస్క్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

స్థానిక ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు సమాచారం కోసం హెల్ప్‌డెస్క్‌ను సందర్శించాలని కళాశాల ప్రిన్సిపల్ హర్షలత సూచించారు. నియోజకవర్గంలోని కళ్యాణదుర్గం, బెళుగుప్ప, కంబదూరు, కుందుర్పి, బ్రహ్మసముద్రం మండలాల్లో ఉన్న జూనియర్ కళాశాలలను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకుల బృందం సోమవారం సందర్శించారు. బ్రహ్మసముద్రం మండలంలోని కస్తూరిబా బాలికల కళాశాల, అంబేద్కర్ సాంఘిక సంక్షేమ వసతి బాలికల కళాశాలలోని ఇంటర్ పాసైన విద్యార్థులకు కళ్యాణదుర్గంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు నిపుణులైన అధ్యాపకులు, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కావున ప్రభుత్వ కళాశాలల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీధర్, షౌకత్ అలీ, సుధాకర్, గురుమోహన్, గణేష్, రాధాకృష్ణ, చక్రవర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కెసిఎల్-2 విజేత కణేకల్లు ఆర్డీటీ జట్టు

విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎంపి అంబికా, విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, తదితరులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

కాలవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ సారథ్యంలో నిర్వహించిన కెసిఎల్-2 విజేతగా కణేకల్లు ఆర్డీటీ జట్టు నిలిచింది. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాయదుర్గం ఫ్రెండ్స్ 11, కణేకల్లు ఆర్డీటీ జట్ల మధ్య ఫైనల్ పోటీ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన ఫ్రెండ్స్ 11 జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 101 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కణేకల్లు ఆర్డీటీ జట్టు 13.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఆర్డీటీ సంస్థ డైరెక్టర్ మాంచో ఫెర్రర్, తదితరులు విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. మంత్రి నారా లోకేష్ క్రీడలను ప్రోత్సాహించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతురెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్లు గిరిమల్లప్ప, లాలెప్ప, హనుమంతు, నాయకులు మోహన్‌రెడ్డి, సుదర్శన్, జనసేన మంజునాథ, తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం'తో ప్రతిఇంటా సంతోషం

ఎమ్మెల్యే దగ్గుపాటి

సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం

తల్లికి వందనం పథకం అమలుతో ప్రతి ఇంటా సంతోషం కనిపిస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో 33 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.45.50 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం ఏడాది వ్యవధిలో 130 మందికి రూ.1.70 కోట్ల వరకూ ముఖ్యమంత్రి సహాయ నిధి కింద సాయం అందించామన్నారు. ప్రస్తుతం తల్లికి వందనం పథకం కింద ప్రతి ఇంట ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ రూ.15వేల చొప్పున సాయమందుతోందన్నారు. ఏ ఇంట చూసినా ఆనందం కనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాతూరు మటన్ మార్కెట్ పరిశీలన

మటన్ మార్కెట్‌లో మాట్లాడుతున్న కమిషనర్ బాలస్వామి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని పాతూరు మటన్ మార్కెట్‌లో పారిశుధ్య పనులను కమిషనర్ బాలస్వామి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మటన్ మార్కెట్ పరిశుభ్రత పాటించాలన్నారు. వ్యర్థాలను చెత్తబుట్టల్లో నిల్వ చేయాలని, ఎక్కడబడితే అక్కడ వేయరాదని సూచించారు. అనంతరం నగరంలోని ప్రధాన రహదారుల్లో పారిశుధ్య పనులు, ఆసార్‌వీధి, మున్నానగర్‌లో చేపట్టిన ఇంటింటి చెత్తసేకరణను చెత్త సేకరణను పరిశీలించారు. అలాగే చెత్త సేకరణ ట్రాక్టర్ మైక్ ఏర్పాటు చేసుకోవాలని 18 వా సచివాలయం శానిటేషన్ సెక్రటరీని ఆదేశించారు. తదుపరి పాతూరు అన్నా క్యాంటీన్‌లో అల్పాహార పంపిణీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు, 18వ సచివాలయ శానిటేషన్ సెక్రటరీ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందివ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన సందర్భంగా రైతులు సాగు చేసుకోవడానికి అన్నిరకాల విత్తనాలను 90శాతం సబ్సిడీతో ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయం వద్ద వ్యవసాయ సహాయ సంచాలకులు చంగల్ రాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రి వ్యవసాయ డివిజన్ పరిధిలో తాడిపత్రి, యల్లనూరు, పెద్దపప్పురు, పుట్లూరు, నార్పల మండలాల్లో ఖరీఫ్ సీజన్‌కు సాగు చేసుకునేందుకు వీలుగా రైతులు అన్ని పనులు పూర్తి చేసి సిద్ధంగ చేసుకుని విత్తనం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. అయితే ఇంతవరకూ ప్రభుత్వం విత్తనాలు పంపిణీ చేయలేదన్నారు. కావున ప్రభుత్వం రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి, నాగరాజు, బాలమణి, సూర్యశేఖర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మి ఆగ్రో ఇంజనీరింగ్ వర్క్స్ యాజమాన్యానికి నోటీసులు

ప్రజాశక్తి-అనంతపురం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులకు పనిముట్లు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నందున శ్రీలక్ష్మి ఆగ్రో ఇంజనీరింగ్ వర్క్స్ ఏజెన్సీకి అధికారులు సోమవారం నోటీసులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గించేందుకు వ్యవసాయ శాఖ ద్వారా రాయితీ వ్యవసాయ పనిముట్లను అందిస్తోంది. అయితే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా దరఖాస్తు చేసుకున్న రైతులకు రాయితీ వ్యవసాయ పనిముట్లు సదరు సరఫరాదారులు అందించని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మడకలు, విత్తన గొర్రు, స్ప్రేయర్లు, రోటోవేటర్లను సకాలంలో సరఫరా చేస్తామని టెండర్‌లో పేర్కొన్న ఏజెన్సీలు సీజన్ సమీపిస్తున్నా అందించలేకపోయారు. దీంతో సంబంధిత ఏజెన్సీకి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

క్రీడలకు పెద్దపీట : ఎమ్మెల్యే సురేంద్రబాబు

కళ్యాణదుర్గం రూరల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. సోమవారం జరిగిన ఫైనల్ పోటీలో టిప్పు లగాన్, వర్షస్ రామ్ లెవెన్ జట్లు తలపడగా రామ్ లెవెన్ జట్టు విజయం సాధించింది. విజేత, రన్నప్ జట్లకు ఎమ్మెల్యేతోపాటు మార్కెట్ యార్డు ఛైర్మన్ లక్ష్మీరమేష్‌తో కలిసి బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వారంలో ఓరోజు పూర్తిగా క్రీడలకు కేటాయించినట్లు తెలిపారు.

'ఉపాధి' బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-శింగనమల

పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పథకం బిల్లులను వెంటనే చెల్లించాలని ఎఐకెఎంఎస్ జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, నిరుపేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చి ఇల్లు కట్టివ్వాలని కోరారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపాలని, హెచ్చెల్సీకి సమాంతర కాలువ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద 200 రోజులు పనిదినాలు కల్పించాలని, రూ.600 కూలి ఇవ్వాలని, మహిళలపై జరుగుతున్న హత్యాచారాలు, హత్యలను నిరోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణా, మండల కమిటీ రంగన్న, శంకరన్న, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి సీనియర్ నేతకు నివాళి

యాడికి : అనారోగ్యంతో మృతిచెందిన మండల పరిధిలోని దైవాలమడుగు గ్రామానికి చెందిన సీనియర్ వైసిపి నాయకులు భయపరెడ్డి మృతికి పలువురు నాయకులు సోమవారం నివాళు లర్పించారు. నివాళులర్పించిన వారిలో వైసిపి మండల కన్వీనర్ సంజీవరాయుడు, నాయకులు తూట్రాలపల్లి రామకృష్ణారెడ్డి, కేశవరెడ్డి, నాయీబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు రామ సుబ్బయ్య, తలారి నాగేష్, కొట్టే వెంకటరామిరెడ్డి, మాజీ స్టోర్ డీలర్ రషీదు, హనుమంతురెడ్డి, తదితరులు ఉన్నారు.

దళితులకు భూమి కేటాయించాలని వినతి

బుక్కరాయసముద్రం : భూమిలేని దళితులకు భూమి కేటాయించాలని పలువురు దళితులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని బోడిగానిదొడ్డి గ్రామం పొలంలో సర్వేనెంబర్ 251లో 48 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ భూమిని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 22 కుటుంబాలకు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వరికూటి కాటమయ్య, బండారు కుళ్లాయప్ప, కొర్రపాడు నాగేంద్ర నాగేంద్ర, బండారు చిన్న నాగమణి, సాకే రామచంద్ర, చెదుళ్ల నాగలింగ, సి.నారాయణస్వామి, సాకే ఎరినాగప్ప, మల్లిపోగుల నాగేష్, నాగప్ప, బూసి బాలన్న, సర్వే నారాయణస్వామి, కెకె అగ్రహారం నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కోళ్లఫారం వెంకట నాయుడు మృతి

నార్పల : మండల కేంద్రంలోని సుల్తాన్‌పేట వద్ద కటా సమీపంలోని టీ కొట్టులో రంగాపురం కోళ్ల ఫారం వెంకట నాయుడు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే స్థానికులు ఆటోలో నార్పల ప్రాథమిక వైద్యశాలకు తీసుకొచ్చారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. రంగాపురం నుంచి ద్విచక్ర వాహనంలో నార్పలకు వస్తున్న వెంకటనాయుడు సుల్తాన్‌పేటలోని కాటా సమీపంలో ఉన్న టీ కొట్టు వద్ద ఆగి కాఫీ అడిగాడు. కాఫీ ఆలస్యం అవుతుందని తెలపడంతో కూల్ డ్రింక్ తీసుకున్నాడు. తాగేలోపు ఒక్కసారిగా కుప్పకులిపోయాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు కుమార్తె ఉన్నారు.

CHANGE OF NAME

I, **EGGIDI INDRA KUMAR S/o EGGIDI ANJINEYULU** (OLD NAME) Door No.9-20, P.Kothapalli Village, Athmakur Mandal, Ananthapur Dist. do hereby declare that I have changed my name From **EGGIDI INDRA KUMAR** (OLD NAME) to **EGGIDI BABU S/o EGGIDI ANJINEYULU** (NEW NAME), hence forth my name being called as **EGGIDI BABU** for all purpose. Aadhaar No.971167063167.

రైతు సేవాకేంద్రం తనిఖీ

యాడికి : మండల కేంద్రంలోని రైతు సేవాకేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఇకెవైసి చేయించుకుంటున్న రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలన్నారు. అనంతరం తహాశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్షపాత నమోదు యంత్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి అశోక్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా, సహాయ గణాంక అధికారి, శ్రీనివాసనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వి సినిమా థియేటర్ యాజమాన్యానికి నోటీసులు

తాడిపత్రి : పట్టణంలోని ఎస్‌వి సినిమా థియేటర్ యాజమాన్యానికి తహాశీల్దార్ రజాక్‌వలి సోమవారం నోటీసులు అందజేశారు. థియేటర్‌లో అధిక టికెట్ ధరల వసూళ్లు, నాణ్యతలేని తినుబండారాలు, శీతల పానీయాలు విక్రయం, అపరిశుభ్రత, మున్సిపాలిటీ స్థలంలో పార్కింగ్ వాహనాలకు డబ్బులు వసూలు చేస్తున్నారనే విషయాలపై పట్టణానికి చెందిన సుంకన్న తహాశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇదే విషయమై పత్రికల్లో కథనాలు కూడా వెలువడ్డాయి. ఇందుకు స్పందించిన తహాశీల్దార్ ఈనెల 20వతేదీన విచారణకు హాజరుకావాలని నోటీసులు అందజేశారు.

'ఆడుదాం ఆంధ్రా'పై విజిలెన్స్ విచారణ

విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

శింగనమల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో 'ఆడుదాం ఆంధ్రా'పై విజిలెన్స్ అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. గత వైసిపి ప్రభుత్వంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం అవకతవకలపై శాప్ ఛైర్మన్ ప్రభుత్వానికి లేఖ రాయడంతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి తనిఖీ చేపటినట్లు తెలిపారుఏ. ఈ కార్యక్రమంలో ఎఒ నారాయణరెడ్డి, నాయీబ్రాహ్మణ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, అధికారులు పాల్గొన్నారు.

మహిళా హోంగార్డుకు ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం : పదవీ విరమణ పొందిన మహిళా హోంగార్డు కృష్ణవేణికి సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని ఛాంబర్‌లో ఎస్పీ పి.జగదీష్ ఆర్థికసాయం అందజేశారు. కృష్ణవేణి పదవీ విరమణ సందర్భంగా జిల్లాలోని హోంగార్డుల ఒకరోజు గౌరవ వేతనం నుంచి సేకరించిన రూ.4,33,200ను చెక్కు రూపంలో అందించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐలు పవన్‌కుమార్, రాముడు, ఆర్ఎస్ఐ జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతున్న పద్మావతి

గుంతకల్లు : స్థానిక పాత గుంతకల్లు మస్తాన్‌వలి దర్గా సమీపంలో నివాసం ఉంటున్న వడ్డే పద్మావతి (30) భర్త వడ్డే జంబులింగ తమ్ముళ్లు ఆస్తి గొడవల నేపథ్యంలో సోమవారం ఇంట్లోని ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. వడ్డే పద్మావతి భర్తకు ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. వీరికి మూడు ఇళ్లు ఉన్నాయి. ఇందులో మస్తానయ్య అన్నకు తెలియకుండా ఆ ఇళ్లను బ్యాంకులో తనఖా పెట్టి అప్పు తీసుకున్నాడు. బ్యాంకు వారు నోటీసుకు పంపడంతో అప్పు విషయం తెలిసింది. దీంతో వడ్డే జంబులింగ, భార్య పద్మావతి ఆస్తుల విషయంలో గొడవ పడ్డారు. ఈ విషయమై పోలీసులను ఆశ్రయించారు. అయితే ఆస్తి తగాదాలు తాము తీర్చలేమని పోలీసులు చెప్పారు. సోమవారం కూడా వారు తమ్ముడు మస్తానయ్య, భార్య స్వప్న, తల్లి మరెక్కతో గొడవపడ్డారు. తమకు న్యాయం జరగదని భావించి పద్మావతి ఇంట్లోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్సలు అనంతరం వైద్యులు ప్రాణహాని లేదని చెప్పారు. 2వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సిఐ సత్యబాబు

పుట్లూరు : మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున జరిగిన హత్య కేసులో మృతుడి అన్నతోపాటు వదినను అరెస్టు చేసినట్లు సిఐ సత్యబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. శనివారం తెల్లవారుజామున చిన్న కంబగిరిని అన్న పెద్ద కంబగిరి గొంతు కోసి హత్య చేసిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా తమ విచారణలో హత్యలో పెద్ద కంబగిరితోపాటు ఆయన భార్య గురమ్మ కూడా పాల్గొన్నట్లు తేలిందన్నారు. దీంతో ఇద్దరి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న కలెక్టర్ అమిలినేని

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

కళ్యాణదుర్గం రూరల్ : పలువురు బాధితులకు సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను సోమవారం స్థానిక ప్రజా వేదికలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అందజేశారు. మొత్తం 21 మంది బాధితులకు రూ.15లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, మార్కెట్ యార్డు ఛైర్మన్ లక్ష్మీరమేష్, లాల్‌కృష్ణ, గురుప్రసాద్, శెట్టూరు మండల కన్వీనర్ ఆర్.తిప్పేస్వామి, రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి క్యాంటీన్, షాపులకు టెండర్లు ఆహ్వానం

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో జన్మభూమి క్యాంటీన్, షాపులకు టెండర్లుకు ఆహ్వానిస్తున్నట్లు యూనివర్శిటీ పిఆర్ఒ కె.రాజగోపాల్, యూనివర్శిటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ మధుసూదన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్లు వేయాలనుకునేవారు ఈనెల 17 నుంచి 30వతేదీ వరకూ తమ దరఖాస్తులను ఎస్కుఎయు ఇంజనీర్ విభాగంలో సంప్రదించాలని కోరారు.

సచివాలయం తనిఖీ

పుట్లూరు : మండల పరిధిలోని తక్కలపల్లి సచివాలయాన్ని ఎంపిడిఒ అలివేలమ్మ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం యోగాంధ్ర గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఇకెవైసి చేసుకోండి

తాడిపత్రి రూరల్ : అన్నదాత సుఖీభవ పథకం వర్తించాలంటే తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకూ ఇకెవైసి చేయించుకోని రైతులు జూన్ 20వతేదీలోపు చేయించుకోవాలని సూచించారు.

గుంతకల్లు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన రైతు సుఖీభవతో పాటుగా పిఎం కిసాన్ పథకాలకు పొందాలంటే తప్పనిసరిగా రైతులు ఇకెవైసి చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి వసుంధర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో రైతు సుఖీభవ, పిఎం కిసాన్ యోజన పథకాలకు 10,381 మంది రైతులు అర్హత సాధించారన్నారు. అయితే ఇప్పటి వరకూ చాలామంది రైతులు ఇకెవైసి చేయించుకోలేదన్నారు. మిగిలిన వారందరూ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో యోగాసనాలు

పామిడి : అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా సోమవారం స్థానిక టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్‌కుమార్, ప్రభుత్వ ఆయూష్ వైద్యురాలు కృష్ణవేణి, యోగా శిక్షకురాలు సంధ్యారాణి, ఎన్‌సిసి అధికారి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

'కూటమి' మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణలో నాయకులు

ప్రజాశక్తి-శింగనమల : మండల కేంద్రంలోని వాసవీ కళ్యాణ మండపంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై ప్రచురించిన 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ముందుగా బస్టాండ్ ఆవరణలో ఉన్న అంబేద్కర్, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి సాకే శైలజానాథ్ మాట్లాడుతూ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో స్థానిక రామాలయంలో ఏర్పాటు చేసుకోవద్దని పోలీసులు ఆంక్షలు విధించడం బాధాకరమన్నారు. గత కొన్నేళ్లుగా పార్టీలకతీతంగా ఆలయ ఆవరణలో సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. నియోజకవర్గంలో వైసిపి ఫ్లెక్సీలు తొలగించడం సమావేశాలను అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. నియోజకవర్గంలో వైసీపీకి ఉన్న ప్రజాదరణ చూసి టిడిపి భయపడుతుందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బొమ్మన శ్రీరామిరెడ్డి, ఎంపిపి యోగేశ్వరి, నార్పల సత్యనారాయణరెడ్డి, నారాయణరెడ్డి, కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బొమ్మలాటపల్లి నరసింహారెడ్డి, చాగంటి గురుమూర్తిరెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి, పూల ప్రసాద్, బంగారు అలీబాషా, సాంబశివారెడ్డి, చలపతి, కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ఉరవకొండ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని వైసిపి నాయకులు రాకెట్ల అశోక్‌కుమార్, మాజీ జడ్పిటిసి తిప్పయ్య, మాజీ ఎంపీపీ ఎర్రిస్వామి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై ప్రచురించిన 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం వైసిపి నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెడుతున్నారని, ఏడాదిలో రూ.1.50 లక్షల కోట్ల అప్పు తప్ప ఎలాంటి సాఫల్యం లేదని విమర్శించారు. వైఎస్ జగన్ హామీలతో పాటు చెప్పని పథకాలను కూడా అమలు చేసి, సంక్షేమ పాలన అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఓబన్న, ప్రసాద్, బసవరాజు, ఎర్రిస్వామిరెడ్డి, ఆసీఫ్, జిలాన్, గోవిందు, వెంకటేశులు, ఆంజనేయులు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

టిడిపి నాయకులకు పరామర్శ

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్

ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స అనంతరం నగరంలోని వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న టిడిపి నాయకులు, కార్యకర్తలను అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పరామర్శించారు. సోమవారం ఆయా నేతల నివాసాలకు వెళ్లి పరామర్శించి భరోసా ఇచ్చారు. తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి బోయ శంకర్, టిడిపి డాక్టర్ సెల్ రాష్ట్ర నాయకుడు లక్ష్మి ప్రసాద్‌లను పరామర్శించి, టిడిపి పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మద్యం తాగడానికి డబ్బు ఇవ్వలేదని ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం ధర్మవరంలో చోటుచేసుకుంది. హిందూపురం జిఆర్‌పి పోలీసులు వెంకటరామిరెడ్డి, ఎర్రిస్వామి మాట్లాడుతూ పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన గుండు గోపాల్(57) తాగుడుకు బానిసై తరచూ భార్య, కోడలిని వేధింపుకు గురి చేసేవాడు. కోడలు గర్భిణి కావడంతో ఆమె చికిత్స అత్త రూ. 10వేలు దాచిపెట్టింది. ఈ విషయం తెలుసుకున్న గోపాల్ ఆ రూ. 10వేలు ఇవ్వాలని గొడవ పెట్టుకోగా అత్తా, కోడలు ససేమిరా అన్నారు. దీంతో గోపాల్ క్షణికావేశంలో కాలనీ వెనుక వైపు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే కీమెన్ ఇచ్చిన సమాచారం మేరకు హిందూపురం జిఆర్‌పి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జిఆర్‌పి పోలీసులు తెలిపారు.

'తల్లికి వందనం'కు ప్రయివేటు విద్యార్థులు అర్హులే

ప్రజాశక్తి-కుందుర్పి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకానికి ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు కూడా అర్హులే అని ఎంఇఒ తిప్పేస్వామి తెలిపారు. సోమవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రయివేటు పాఠశాలలకు తల్లికి వందనం వర్తించవని సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాలను నమ్మొద్దన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు అందరికీ తల్లికి వందనం వర్తిస్తుందన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎంఇఒ తిప్పేస్వామి

ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కల్పించాలని వినతి

కళ్యాణదుర్గం రూరల్ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎస్సీ, ఎస్టీ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఎస్సీ ఎస్టీ జేఏసీ దళిత గిరిజన సంఘాల నాయకులు సోమవారం జిల్లాకేంద్రంలో ఎస్పీ జగదీష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టం, గ్రామాల్లో అనుసరిస్తున్న రెండు గ్లాసుల పద్ధతిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా పలుచోట్ల ఎస్సీ, ఎస్టీల భూములను ఆక్రమించుకుని పేదలకు అన్యాయం చేస్తున్న, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జెఎసి జిల్లా అధ్యక్షులు దొణతిమ్మ, కంబదూరు మండలాధ్యక్షుడు డాబా రమేష్, నారాయణ, చంద్ర, ఎర్రగుంట గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ జెఏసి నేతలు

వృద్ధులకు, వికలాంగులకు సహాయ పరికరాలు

పెద్దపప్పూరు : మండల వ్యాప్తంగా ఉన్న వృద్ధులకు సహాయ పరికరాల గుర్తింపు కోసం ఈనెల 18న తాడిపత్రిలో ఉన్న ప్రభుత్వ కళాశాలలో నమోదు చేసుకోవాలని ఎంపిడిఒ శకుంతలమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధులకు ఉపయోగపడే చేతికర్రలు, చెవిటి మిషన్లు, తోపుడు బండ్లు, మూడు చక్రాల వాహనాలు, తదితర వాటికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

యాడికి : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ యాడికి ప్రెసిడెంట్ బండారు బాలకృష్ణ తెలిపారు. ఈ శిబిరంలో 50 మంది రక్తదాతలు పాల్గొని రక్తాన్ని దానం చేసిననట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి సేవా బ్లడ్‌సెంటర్ మెడికల్ ఆఫీసర్ పెనుగొండ శివకుమార్, నిర్వాహకులు పేరి అశోక్, పేరి విజయకుమార్, సిబ్బంది పేరి పవన్, అశోక్, సాయి, సతీష్, మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు బండారు బాలకృష్ణ, చందగాని ధృవనారాయణ, ఆలూరు చంద్రశేఖర్‌రెడ్డి, గాంధీజీ స్కూల్ రామమోహన్, చింతా నరసింహ, సాయివరపు నాగరాజు, మెటికల చెన్నయ్య, టి.లక్ష్మీకాంతమ్మ, సాయివరపు నాగరాజు, కావలి సుధాకర్ (వెంకటాంపల్లి), తదితరులు పాల్గొన్నారు.

బోయ ఓబుళమ్మ మృతికి నివాళి

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామానికి చెందిన కట్టు నారాయణస్వామి తల్లి కట్టు బోయ ఓబుళమ్మ మృతికి టిడిపి నాయకులు దేవినేని ధర్మతేజ సోమవారం నివాళులర్పించారు. అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న ధర్మతేజ మృతురాలి ఇంటికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో గ్రామ అధ్యక్షులు చాకలి వెంకటేష్, సీనియర్ నాయకులు బోయ మారెప్ప, రంగారెడ్డి, కురుబ మల్లికార్జున మల్లయ్య, మీసేవా బాబు, గోపాల్, గంగిరెడ్డి, హరిజన మల్లికార్జున, ఎర్రిస్వామి, జయరామ్, గంగాధర్, నారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజినేయులు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



బాధితు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ధర్మతేజ